# ఈ దేశం నాది

పోరాటపు పద్ధతి అవగతం కాని వాడు — శాంతిని చెప్పేందుకు అర్హుడు కాడు.

సంఘర్షణానుభవం దండిగా లేనివాడు నిజమైన శాంతికాముడు కాలేడు—

శాంతి అంటే — అసలు మీ భావనేమిటి?

ధర్మం — స్నేహం — సహజీవనం కదా!

అంతే కాదు.

శాంతి అంటే — ఈ అన్ని లక్షణాలూ సంఘటితమవడం.

సంఘటిత మవడమంటే— అశాంతిని ఎరించడం — లేకుండా వేయడం.

అయితే శాంతి ఎప్పుడొస్తుంది? అంటే.

'సమరం' తరువాత—

మరి!

'శాంతి'లో ఉంటూ—'శాంతి'ని కాంక్షిస్తూ — 'శాంతి'ని గురించి కలలుకంటూ 'శాంతి'ని గురించి ఆలోచిస్తూ — కాలం గడపడం కాదు. 'శాంతి' పరిరక్షణకు వేయాల్సిన యుద్ధాన్ని గురించి— 'శాంతి'లో వ్యూహరచన వేయాలి—

అప్పుడు—

అప్పుడే

సుస్థిరమైన 'శాంతి' నట్టింట నిలుస్తుంది.

'శాంతి' అంటే మనకు అర్థం అవుతుంది.

రాజీగా బ్రతకడం — రాజీపడడం 'శాంతి' కాదు — కారాదు.

మనం సుఖంగా బ్రతుకుదామనుకొనడమూ 'శాంతి' కాదు!

'నా జాతి గొప్పది. నా దేశం గొప్పది. దాని సంస్కృతి అంతకన్నా గొప్పదని' అరవడమూ 'శాంతి' కాదు.

జాతి జీవన పరిరక్షణకు — యుద్ధస్పృహతో మెళకువగా ఉండడం 'శాంతి' — భీష్ముడంత శాంతిమూర్తి చరిత్రలో మనకెవరు కనిపిస్తారు?

ఆయనా యుద్ధం చేసాడు.

ధర్మజుడూ యుద్ధం చేసాడు—

భరత వంశానికి విద్యగాపిన గురువు ద్రోణుడు యుద్ధం చేసాడు—

రణక్షేత్రంలోనే గీతోపదేశం జరిగింది!

ఎందుకు?

'శాంతి' పరిరక్షణ కోసం —

పూజ్య బాపూజీ — చేపట్టిన ఆయుధమే— శాంతి అహింసలు కదా!

ఆ ఆయుధాలే కదా— సూర్యాస్తమయ మెరుగని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గజగజ లాడించింది—

అందుకే—

'శాంతి' అన్నదాన్ని మనస్సు పెట్టి సరిగ్గా అవగతం చేసుకోండి. అర్థమవుతుంది

అర్థమయినదాన్ని అనుసరించండి — 'శాంతి' దొరుకుతుంది — 'ప్రశాంతి నిలయమౌతుంది'

ఇలా సాగుతూంది ప్రసంగం.

ఓ సాధు — సత్రంలో విశ్రాంతిగా కూర్చుని ఉన్నప్పుడు — 'జరుగుతున్న దారుణమారణ కాండను ప్రస్తావిస్తే — ఆయున మాట్లాడిన తీరది. 'మనం భారతీయులం గదా! ఇక్కడున్న మనమే — కులమనీ — మతమనీ ఇంత భీభత్సాన్ని సృష్టిస్తూ పోతే — జాతి ఏమౌతుంది?'' అనడిగాడొకడు! నవ్వాడు సాధు. ఓక్షణం కళ్ళు మూసుకొని — తిరిగి ప్రారంభించాడు.

''మనం ప్రపంచ వ్యాప్తంగా ఉన్నా ఇక్కడి వారమే! మిగిలిన మతాల వారు ఎక్కడెక్కడ ఉన్నా అక్కడక్కడివారే! ఇది మూలంలోని బేధం. మనిషి అభిమతమే మత భావన అయినా —మనం దీన్ని అనువంశికంగా— సాంప్రదాయంలాగా భావిస్తూ — నిర్వర్తిస్తూ వస్తున్నాం. మనం అనాదిగా ఇక్కడి జాతీయులమే అయినా — బ్రతుకులో చాలా భాగం — హిందువులం అనుకోం. మామూలు మనుషులుగానే మెలుగుతాం. మనలో ఎవర్నో కలుపుకోవాలనీ, తద్వారా మతాన్ని ఖండాంతరాలకు వ్యాపింపచేయాలనీ అనుకోం. మన ధర్మం, మన జాతిధార, మన జీవన స్రవంతి మనకుంది. అంచేత పరిధిలో నడుస్తాం. మన నడక తీరది. అయినా పరమతాలతో ఘర్షణ స్వభావం ఎందుకు పుడుతుంది?

నిజంగా ఇది — మనం తెల్సుకోవాల్సిన ప్రశ్న.

ఈ విశ్వంలో ఉన్న మిగిలిన మతస్వామ్యాలు, వాటిని విశ్వవ్యాప్తం చేయాలనే జిజ్ఞాసతో పనిచేయడం ప్రారంభించినాయి. రాజ్యాధికారాలున్న చోట బలవంతంగా మత మర్మాడిలూ— జరిగినాయి. మనకు తలపై వెంట్రుకలుంచుకున్నందుకు — మన దేశం వచ్చి మన రాజ్యాధినేతలైన నవాబులు, ''జిజియా'' పన్ను వేయడం — మనకు తెల్సు. మన జాతిని అధికారదర్పంతో మతాంతరీకరణ చేయడమూ తెల్సు— మన ఆలయాలపైనో, వాటి శిథిలాలపైననో, ఆరాళ్ళతోటే గోరీలూ— దర్గాలూ కట్టబడ్డాయి — ఇది చరిత్ర చెపుతున్న సత్యం— కనిపిస్తున్న నిజం. మనిషి పేదరికాన్ని ఆసరాగా తీసుకొని, ఎంతో కొంత ఆర్థికంగా అండగా ఉంటూ, మతాంతరీకరణ చేస్తున్న మతాలూ ఉన్నాయి. అట్టా మార్చుకుంటూ — విశ్వవ్యాపితంగా ఎవరికి వారు— వారే ఎదిగి వట వృక్షాల్లాగయి, మరో మొక్క బ్రతికే వీలులేనంతగా మిగలాలనే, ఆకాంక్షతో నడుస్తున్న ప్రయాణం ఇది. మరి ఇలాంటి స్థితిలో మత వ్యాప్తితో — సంఘర్షణ ప్రారంభం కాక తప్పదు.

ఎవరికి వారు — తమ అభిమతాన్ని వ్యాపింప చేయాలనుకోవడంతో ఘర్షణ అనివార్యమౌతుంది గదా. ఇక ఇక్కడి వారి స్థితి ఎవడు ప్రలోభపెట్టి — తమవైపుకు తిప్పుకున్నా మాయ చేసి ఆకట్టుకున్నా— ఎవడు భయపెట్టి దౌర్జన్యం చేసి తిప్పుకున్నా— అధికారికంగా చేసినా ఇక్కడ వాళ్ళనే కదా!

## చావా శివకోటి

ఈ దేశీయత కానివారు, ఇక్కడ అధికారంలో ఉన్నంతకాలం చేసారు. మరి ఇప్పుడు?

ఇప్పుడూ వారు వేరే ఏదో చేస్తున్నారని కాదు—

కానీ నోరెత్తి—

"మతాంతరీకరణ ధోరణే తప్పు" అంటున్నారు ఇక్కడివారు.

అదీ మత సామరస్య ధోరణితో—

'భరతజాతి' అవే దాని క్రింద—

మంచి మనుషులుగా జీవితం సాగిద్దామంటున్నారు.

గతాన్ని మరచిపొమ్మంటున్నారు?

మతం, అభిమతం ఏదైనా 'భారతీయులు'గా మారి జాతి జీవనంలో జీవన ధారగా మారమంటున్నారు.

దీన్ని సహించలేని వారు — ఈ జీవన వాహినిలో సమ్మిళితం కాలేని వారు—

భారతీయులెలా అవుతారు? అరక్షణం ఆలోచించి చూడండి.

మరి అలా కాని వారు ఇక్కడెందుకు?

వారి వారి జీవన స్రవంతిల్లో కలిసి పోతే పోతుంది గదా!

మరి ఇక్కడ అలా జరగడం లేదు. పైగా—

వారి వారి జీవన స్రవంతులను ఇక్కడ సృష్టించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. దానికి ఇక్కడున్న రాజకీయ వేత్తలు బలహీనతల్ని వాడుకుంటున్నారు. ఆ ప్రయత్న ఫలితమే ఈ జాతి జీవన సంకుల సమరం.

ఇక్కడి అధికార దాహపు రాజకీయాలు—

ఒకరి తరువాత ఒకరు, జాతిని మరచి ఉపయోగపడి — వంచించబడి—

జాతీయ భావనను వంచనకు గురిచేసే ప్రయత్నంలో ఉన్నారు.


జాతి జీవననాడిని ఛిద్రం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆత్మహత్యా సదృశ్యమైన విషయం.

'మనిషి కంటే సమాజం గొప్పది'.

'సమాజం కంటే జాతి గొప్పది'.

'జాతి కంటే దేశం — దేశీయతా భావన గొప్పది'.

ఈ దేశపు రాజకీయ పరిధిలోకి అడుగపెట్టే ప్రతివ్యక్తీ— ఈ భావనకు నమస్కరించి —అనుసరిస్తారని కన్న తల్లిపై ప్రమాణం చేసి— అడుగు వేస్తే — తప్ప.



ఇది ప్రపంచం గర్వించదగ్గ జాతిగా మారదు.

ఆ భావన కోసం సౌశీల్యం కోసం — ఇలాంటి మనుగడ కోసం కలలు కన్న మన పెద్దలూ — శౌర్యధనులూ — ఈ జాతిని తీర్చిదిద్ద ప్రయత్నించిన మానధనులూ — ఎక్కడున్నా — మన్ని ఆశీర్వదించి—

ఇంకా ముందడుగు వేసేందుకు మార్గం చూపుతారు.